

పాపం పండుతోంది!

జగన్ జమానాలో జరిగిన ఉల్లం'ఘనుల' పాపం పండుతోంది. 2023-24 మధ్య రెండేళ్ల పాటు ఇష్టారాజ్యంగా సాగిన అడ్డగోలు దోపిడీని లెక్కగట్టి భూగర్భ-గనులశాఖ కొరడా ఝుళిపించింది. సిలికా మైనింగ్‌లో మూడొంతులకు పైగా ఇసుకాసురులను గుర్తించి బ్లాక్‌లిస్టులో చేర్చింది. క్వార్ట్జ్ దొంగల గుండెల్లోను లారీలు పరుగెత్తిస్తోంది. గీత దాటిన వారందరిపై భారీగా జరిమానాలతో పాటు సీఐడీ క్రిమినల్ చర్యలకూ సిద్ధమవుతోంది.

- గూడూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

- విచ్చలవిడి అక్రమాలపై మైనింగ్ యాక్షన్
- 348 ఎండీఎల్‌లు ఔట్.. 110 ఓకే
- జరిమానాలు, సీఐటీ విచారణలతో ఉలం'ఘనులు' ఉక్కిరి బిక్కిరి



జిల్లాలో చిల్లకూరు, కోట మండలాల్లో అరుదైన సిలికా శాండ్, గూడూరు రూరల్ మండలంలో క్వార్ట్జ్ ఖనిజ నిక్షేపాలు అపారంగా ఉన్నాయి. ఈ ఖనిజాలకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉండటంతో గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ దందా పరాకాష్టకు చేరింది. లక్షలాది టన్నుల సిలికాను పలు అక్రమ పద్ధతుల్లో ఇక్కడి నుంచి తరలించేశారు. వేలాది టన్నుల క్వార్ట్జ్ ఖనిజాన్ని చైనా, సింగపూర్, అరబ్ దేశాలకు 'జే' ట్యాక్స్ దండుకుని దాటించేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ అక్రమాలపై దృష్టిసారించింది. ఉన్నపళంగా మైనింగ్ లీజులు, ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్సు)ను సుప్తావస్థలో పెట్టింది. మైనింగ్ లీజుదారుల నుంచి బలవంతంగా గనులను లాక్కొని ఇష్టమొచ్చినట్లు తవ్వి తరలించినట్లు గుర్తించారు. ఈ ప్రాంతానికి చెందిన వైసీపీ కీలక నేత సిలికాను ఎగరేసుకుపోవడంతో గూడూరు మండలంలోని మంగళపూరు వద్ద ఓ క్వార్ట్జ్‌ను వైసీపీ పెద్దలు విదేశాలకు తరలించిన ఉదంతం కూడా సీఐడీ విచారణలో ఉంది. మైనింగ్ డీలర్ల లైసెన్స్‌లలో కూడా అవినీతి అంతా ఇంతా కాదు. కూటమి ప్రభుత్వం దీనిపై గత అక్టోబరు చివరి వారంలో అసిస్టెంట్ డైరెక్టర్ స్థాయి అధికారులతో మూడు ప్రత్యేక బృందాలతో విచారణ జరిపించి అక్రమాలు లెక్క కట్టించింది. రికార్డులకు వాస్తవ నిల్వలకు భారీ వ్యత్యాసాలు కనిపించడంతో 327 కంపెనీలకు మైనింగ్ అధికారులు తాకీదులిచ్చారు. ఒక్కో ఎండీఎల్‌కు లక్షల్లో పెనాల్టీ విధించారు. వైసీపీ కీలక నేతకు చెందిన సుమారు 25 కంపెనీలకు రూ.కోట్లలో జరిమానాలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని మైనింగ్ శాఖ అధికారులు ప్రభుత్వ పెద్దలకు పంపిన నివేదికలో పేర్కొన్నారు. చిన్న చిన్న తేడాలను పెనాల్టీలతో హెచ్చరించి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఉన్నత ప్రభుత్వ వర్గాలు సూచించడంతో ఆ మేరకు కొన్నింటికి స్థానిక అధికారులు అనుమతులు మంజూరు చేశారు. 93 ఎండీఎల్‌లు సిలికా గ్రేడింగ్, పాలిషింగ్, రవాణా మొదలు పెట్టాయి. 306 కంపెనీలు బ్లాక్‌లిస్టులో చేరిపోయాయి. మొత్తం 80 సిలికా మైన్లలో 13కి మాత్రమే అనుమతులు లభించాయి. మేజర్ మినరల్స్ అయిన మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్, వర్మిక్‌లైట్ మెన్‌తో పాటు గ్రావెల్, రోడ్ మెటల్లాంటి క్వారీలకు కూడా పెద్దగా అనుమతులు ఇవ్వలేదు. మొత్తం 20 లీజులకు తొమ్మిదింటికి మాత్రమే మైనింగ్ అనుమతించారు. 59 ఎండీఎల్‌లలో 17కంపెనీలు మాత్రమే కొద్దిరోజుల కిందట గ్రేడింగ్, రవాణా ప్రారంభించాయి.

చిల్లకూరు మండలం మోమిడి, తమ్మినపట్నం, చింతవరం, బల్లవోలు, వరగలి, ఏరూరు, వేళ్లపాళెం, కోట మండలంలోని సిద్ధవరం, కొత్తపట్నం గ్రామాల్లో సుమారు 1200 హెక్టార్లలో 80 కంపెనీలకు సిలికా శాండ్ మైనింగ్ కోసం.. గూడూరు రూరల్, చిల్లకూరు మండలాల్లో పలుచోట్ల మైకా, క్వార్ట్జ్, ఫెల్డ్ స్పార్, వర్మిక్‌లైట్, గ్రావెల్, రోడ్ మెటల్ ఖనిజాల కోసం మరో 20 మైనింగ్ లీజులకు ప్రభుత్వ మంజూరులున్నాయి. అలాగే, సిలికా శాండ్ మైనింగ్‌కి చిల్లకూరు మండలంలో రామిరెడ్డిపాళెం, కలవకొండ, ఉడతావారిపాళెం, పొన్నవోలు గ్రామాల్లో 399, గూడూరు రూరల్ మండలంలో పలు ఖనిజాల ట్రేడింగ్ కోసం మరో 59 ఎండీఎల్(మైనింగ్ డీలర్స్ లైసెన్స్)లు ఏర్పాటయ్యాయి. ఇవన్నీ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకుముందు జరిగిన అనుమతులు కావడం గమనార్హం.



గీత దాటితే తిప్పలే

గనుల నిర్వహణ, రవాణాలో గీత దాటితే తిప్పలు తప్పవు. ఎండీఎల్ యార్డుల్లో నిల్వలు-రికార్డుల్లో లెక్కలు వ్యత్యాసం చూపకూడదు. నిఘా కెమెరాలు, భౌగోళిక ఆకాంక్షలు(జియో లాజికల్ కో-ఆర్డినేట్స్) ఏర్పాట్లను అందుబాటులో ఉంచుకోవాలి. మైనింగ్‌లో అక్రమాలు ఏమాత్రం ఉపేక్షించబోం. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.28కోట్లు ప్రభుత్వ ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రచించుకున్నాం.

- శ్రీనివాసరావు, డీఎంజీవో

కాకాణి అరెస్టుతో వెంకటగిరిలో హడావిడి

- తరలివచ్చిన వైసీపీ నేతలు, కార్యకర్తలు
- కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్



కోర్టు వద్ద నుంచి జనాన్ని పంపిస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి, సీఐ ఏవీ రమణ

వెంకటగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుతో సోమవారం వెంకటగిరి పట్టణంలో హడావిడి నెలకొంది. గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పోలీసులు రిమాండు నిమిత్తం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఉదయం నుంచే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చారు. వైసీపీ శ్రేణుల నుంచీ ప్రతిఘటన, ఆందోళనలు ఎదురవుతాయేమోనని పోలీసులు ముందు జాగ్రత్తగా కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ విధించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో సోమవారం హడావిడి, ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి ఏ4 నిందితుడిగా వున్న ఆ జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు ఆదివారం కర్ణాటకలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన్ను సోమవారం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. వాస్తవానికి ఈ కేసు గూడూరు అడిషినల్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధికి సంబంధించింది. ఆ కోర్టు మేజిస్ట్రేట్ సెలవులో వుండడంతో వెంకటగిరి మేజిస్ట్రేట్ విష్ణు వర్మ గూడూరు కోర్టుకు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ కారణంగా నెల్లూరు పోలీసులు కాకాణిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం వెంకటగిరి కోర్టుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నుంచీ పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. వైసీపీ శ్రేణులు ఆందోళన చేపడతాయనే అనుమానంతో ఉదయం 6 గంటల నుంచే కోర్టు వద్ద భారీగా పోలీసులు మొహరించారు. కోర్టు పరిసరాల్లో 200 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. ఉదయం 11.20 గంటలకు వైసీపీ ముఖ్య నాయకులు కోర్టు వద్దకు చేరుకోగా 11.30 గంటలకు కాకాణిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. రిమాండు రిపోర్టు పరిశీలించిన మేజిస్ట్రేట్ విచారణ మొదలుపెట్టి ఇరువైపుల వాదనలు విన్నారు. ప్రాసిక్యూషన్ తరపున గూడూరు కోర్టు ఏపీపీ కేదార్‌నాథ్.. మాజీ మంత్రి తరపున న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, రోజా రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్ అనంతరం 3.10 గంటల సమయంలో మేజిస్ట్రేట్ కాకానికి 14 రోజుల పాటు రిమాండు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కోర్టు నుంచి బయటకు వస్తున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి

విచారణ జరిగింతసేపూ చేతులు కట్టుకునే..

సోమవారం ఉదయం 11.30 నుంచీ మధ్యాహ్నం 3.10 గంటల దాకా మధ్యలో భోజనం విరామం మినహా విచారణ జరిగింతసేపూ కోర్టులో మాజీ మంత్రి కాకాణి చేతులు కట్టుకుని నిలబడే ఉన్నారు. మేజిస్ట్రేట్ రిమాండు విధించాక పక్కనున్న గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. రిమాండు ఉత్తర్వులు వచ్చాక కాకాణి తరపు న్యాయవాదులు జైల్లో ఆయనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పిటిషన్ వేశారు.

వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ

కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రిమాండు విధిస్తారా లేక బెయిల్ మంజూరవుతుందా అని వైసీపీ శ్రేణులు ఉత్కంఠగా వేచి చూశాయి. పోలీసు ఆంక్షల కారణంగా శ్రేణులు కోర్టుకు దూరంగా వుండిపోగా ముఖ్య నాయకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు కోర్టు హాలులోను, మిగిలి ద్వితీయ శ్రేణి నేతలు కోర్టు ఆవరణలో గడిపారు. వారంతా మేజిస్ట్రేట్ నిర్ణయం కోసం ఆత్రుతగా నిరీక్షించారు. చివరికి రిమాండు విధించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. మొత్తానికీ కాకాణిని వెంకటగిరి కోర్టుకు తీసుకురావడంతో పట్టణంలో హడావిడి, ఉత్కంఠ నెలకొంది.



అమాస బాలు అలియాస్ పవన్

హలో.. చంద్రగిరి ఎమ్మెల్యే పీఏని మాట్లాడుతున్నా!

- ఎయిర్ పోర్టులో ఉద్యోగాల పేరిట మోసం
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన క్యాబ్ డ్రైవరు
- మాజీ మంత్రి అనుచరులతో సంబంధాలు?

తిరుపతి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): అతడు క్యాబ్ డ్రైవర్. కానీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌నని చెప్పుకొంటాడు. 'హలో.. నేను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ను మాట్లాడుతున్నా. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఉన్నాయి. మీరు ఎక్కువ కట్టాల్సిన అవసరంలేదు. అంతా కలిపి రూ.50వేలు లోపు పంపిస్తే చాలు' అంటూ కొంతకాలంగా అమాయక యువతను మోసగిస్తున్నాడు. ఎట్టకేలకు ఇతడిని తిరుచానూరు పోలీసులు పట్టుకున్నారు. అతడికి ఓ మాజీ మంత్రి అనుచరుల వాట్సాప్ గ్రూప్‌లో పేరు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటలోని అమాస బాలు అలియాస్ ఇండిగో పవన్ రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ని అంటూ పలువురితో పరిచయం చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల పేరిట నమ్మించి డబ్బులు తీసుకుని మోసగించేవాడు. ఈ క్రమంలో సోమవారం తాను ఎమ్మెల్యే పీఏనంటూ తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన ఓ వ్యక్తికి ఫోను చేసి బేరం పెట్టాడు. ఆ తర్వాత పైడిపల్లి వ్యక్తి చంద్రగిరి ఎమ్మెల్యే పీఏ పవన్‌కు ఫోన్ చేసి.. నగదు ఎంత వేయాలని అడిగారు. ఏం డబ్బులు, ఏం ఉద్యోగం అంటూ అతడిని నాని పీఏ పవన్ ప్రశ్నించగా.. మీ పేరులో కాల్ చేశారంటూ అసలు విషయం చెప్పారు. దీంతో తన పేరిట మోసం చేస్తున్న వ్యక్తిపై పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు నిందితుడు అమాస బాలును తిరుచానూరు పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు. అమాస బాలు ఫోన్ లిస్టును పరిశీలించగా ఓ మాజీ మంత్రితో పాటు వైసీపీ నేతల వాట్సాప్‌గ్రూప్‌లో ఉండటం విశేషం. వైసీపీ నేతల ప్రోద్బలంతో ఎమ్మెల్యే పీఏ పేరిట మోసం చేశాడా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.

ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సులు ఆపండి

ఆర్టీసీ ఎండీ తిరుమలరావు



సత్యవేడు డిపోలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

సత్యవేడు/పుత్తూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సు ఆపాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన సత్యవేడు, పుత్తూరు డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులకు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఎస్‌బీటీ బకాయిలను చెల్లించామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రమాద బీమాను రూ.కోటి వరకు పెంచినట్లు వివరించారు. గతంలో రూ.3,000 పింఛను ఇచ్చేవారని ప్రస్తుతం దాన్ని రూ.12,000 పెంచామన్నారు. భవిష్యత్తులో సర్వీసును బట్టి ప్రభుత్వోద్యోగుల తరహాలో పించన్లు అందుకుంటారని చెప్పారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు అవసరమైన రూట్లలో సర్వీసులు నడపాలన్నారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపులో ప్రతిభ కనబరచిన సత్యవేడు డిపో డ్రైవర్లు వీరయ్య, మధు, సురేష్‌కు ఎండీ ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. కాగా డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎండీ తిరుమలరావును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సత్యవేడు నుంచి విజయవాడకు, ఊత్తుకోట్టై మీదుగా చెన్నై, చిత్తూరు, సూళ్లూరుపేట, తిరువళ్లూరుకు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. పుత్తూరు డిపో నుంచి అమరావతికి, బెంగళూరు, హైదరాబాదు, వేళాంకన్ని, తిరువణ్ణామలైకి సీఎన్‌జీ, విద్యుత్ బస్సులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డిపోలో 140 నుంచి 70 సర్వీసులకు తగ్గిపోయిందని ప్రస్తావించగా... మునుపటి కళను తీసుకువస్తామని అన్నారు. పుత్తూరు బస్టాండుకు రంగులు వేయాలని డిపో మేనేజర్ ప్రశాంతిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఈడీవో పల్లంరాజు, ఈడీఈ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈలు శ్రీనివాసులు, బాలాజి, డీఎం వెంకటరమణ, ఎన్‌ఎంయూఏ, ఈయూ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహానాడు ఏర్పాట్లలో .....



కడప జిల్లాలో జరుగుతున్న తెలుగుదేశం ఏడాది పండుగ మహానాడు ఏర్పాట్లలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని,పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ పాలుపంచుకుంటున్నారు. సోమవారం సాయంత్రం మహానాడు సభాప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను వారు పర్యవేక్షించారు.బంగారు పాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ ధరణి, పూతలపట్టు నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, చిరంజీవి తదితరులు వారితో పాటు వున్నారు.

కలెక్టర్‌కు ఘన సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నరసింహయాదవ్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తాతయ్య గుంట గంగమ్మ ఆలయం చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు కలెక్టర్‌ను, జేసీని సోమవారం ఘనంగా సన్మానించారు. గంగమ్మ ఆలయం చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారి స్థలాలను నిషేధిత భూముల జాబితాలో ఉంచారు. ఈ విషయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆ స్థలాన్ని 22ఏ నుంచి తొలగించారు. దీంతో సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, జేసీ శుభం బన్సల్‌ను ఘనంగా సన్మానించారు. నరసింహయాదవ్, భరణి యాదవ్, ఈతమాకుల హేమంత్‌కుమార్, కట్టా జయరామ్‌యాదవ్, చింతా రమేష్, చింతా మురళి, చింతా సురేష్, చింతా ప్రభాకర్, బాలాజీగుప్తా, రమేష్‌రెడ్డి, చంద్ర, చింతా రమణ, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లలో
నాయకత్వ లక్షణాలు అవసరం
- కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే



క్యాడెట్లకు ఫైరింగ్ ఫైట్‌పై శిక్షణ

రామచంద్రాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు దేశ రక్షణ కోసం ఎన్‌సీసీలో చేరి ఐకమత్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే కోరారు. సోమవారం సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో వార్షిక శిక్షణా శిబిరాలు ఎన్‌సీసీ ఆధ్వర్యంలో అట్టహాసంగా ప్రారంభయ్యాయి. తిరుపతి, మదనపల్లె, బద్వేల్, చిత్తూరుకు చెందిన 20 విద్యాసంస్థల నుంచి 509మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని క్యాంపు పరిశీలకులు గుణశేఖర్ తెలిపారు. సీనియర్ అసోసియేషట్ ఎన్‌సీసీ అధికారి కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రధాన సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. యోగ, డ్రిల్స్, పారిశుధ్యం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణాధికారి లక్ష్మీనరసింహ, ఉపేందర్‌రెడ్డి, ప్రియ, హేమలత, శిరీష పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు అమావాస్య ఘడియలు కలిసి రావడంతో రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 548 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,139, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,220మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,497మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,331, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 246, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 76మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,991 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు



రోడ్డుపై బోల్తాపడిన కారు



గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

పెళ్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): కారు బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పెన్నేపల్లి 71వ జాతీయ రహదరిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు ..నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్ ఎస్‌బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ భార్య తమిళనాడులోని రాయవేలూరులోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు పోలమ్మ, రమణయ్యలతో కలసి చంద్రశేఖర్ కారులో రాయవేలూరుకు వెళ్లారు. అనతరం రాయవేలూరు నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని పెన్నేపల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలమ్మ, రమణయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నాయుడుపేట ప్రభుత్వా సుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి భక్తులకు జూన్ నుంచి
రైల్వే టికెట్ రిజర్వేషన్ సౌకర్యం

తిరుపతి(సెంట్రల్), మే 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆగస్టు నెలలో టికెట్లు కొన్న భక్తులకు జూన్‌లో ప్రయాణపు టికెట్‌లు రిజర్వేషన్ చేసుకునే వసతిని రైల్వే శాఖ కల్పించిందని తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు టీటీడీ, రైల్వేశాఖల ఉన్నతాధికారులు చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. దర్శనం టికెట్లు కొని రైలు రిజర్వేషన్ ఖరారు కాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తిరుమలకు వచ్చే భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోందన్నారు.

పోలీస్ పీజీఆర్‌ఎస్‌కు 74 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌కు మొత్తం 74 ఫిర్యాదులు అందాయి. వాటిల్లో ఎక్కువగా సివిల్ పంచాయితీలు, భూ దందాలు, ఆర్థిక సమస్యలు, భూ ఆక్రమణలు, నకిలీ రికార్డులు సృష్టించి భూ దందాలు చేయడం, భార్యాభర్తల తగాదాలు, ప్రేమ వివాహాలు, కుటుంబ సమస్యలు, చిన్న, చిన్న గలాటాలు, నేరాలు జరిగినప్పుడు ఫిర్యాదుదారులకు కొన్ని స్టేషన్లలో న్యాయం జరగడంలేదనే ఫిర్యాదులు ఎక్కువగా అందాయి. వాటిని పరిశీలించి తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, సీఐలు సాధిక్ అలీ, శ్రీరాములు, జయచంద్ర, మురళిమోహన్‌రావు, సునిల్‌కుమార్, సంగమేశ్వరరావు, హుస్సేన్‌భాష, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏమార్చి.. రెండు కార్లు అపహరించి...

తిరుపతి(నేరవిభాగం), మే 26(ఆంధ్రజ్యోతి): ఒక ట్రావెల్స్ యజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తి రెండు కార్లతో పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈస్ట్ ఎస్ఐ రామాంజులు కథనం మేరకు.. కదిరికి చెందిన మురళినాయక్ తిరుపతిలోని కారు యజమాని విష్ణువర్ధన రాజు వద్ద రెండేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్రైవర్‌పై తొలినుంచి నమ్మకం పెంచుకున్న యజమాని అతను అడిగినప్పుడల్లా కార్లు ఇచ్చి పంపేవాడు. ఇటీవల ఒక కారు నెలవారీ బాడుగకు అడిగి తీసుకున్నాడు. ఇలా రోజుకు రూ.1500 వంతున బాడుగ చెల్లిస్తూ వచ్చాడు. ఇదే నమ్మకంతో మరో కారును బాడుగకు ఇచ్చాడు. ఈ రెండు కార్లు నమ్మకంతో బాడుగకు తోలుకుంటూ బాడుగ సక్రమంగా చెల్లిస్తూ వచ్చిన మురళి నాయక్.. ఉన్నపళంగా ఆ రెండు కార్లతోపాటు అతడూ పరారయ్యాడు. దీంతో కార్ల యజమాని విష్ణువర్ధనరాజు సోమవారం ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ రామాంజులు కేసు నమోదు చేశారు.

గ్రామస్థాయిలో వైసీపీ బలోతానికి కృషి



నూతన అధ్యక్షులతో మోహిత్‌రెడ్డి, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు

తిరుపతిరూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో వైసీపీని మరింతగా బలోపేతం చేసేందుకు నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ అధ్యక్షులు కృషి చేయాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. నూతనంగా ఎన్నికైన వారిని విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డితో కలసి సోమవారం తుమ్మలగుంటలోని తన నివాసంలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే వారికి అండగా ఉంటానన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఉపేంద్రరెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన యూనియన్ బ్యాంకు జోనల్ ఆఫీస్ జనరల్ మేనేజరు



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసకుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్‌ను యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీస్ జనరల్ మేనేజర్ పత్రి శ్రీనివాసకుమార్, తిరుపతి రీజనల్ మేనేజరు సోమంతి శర్మ, ఎల్డీఎం రవికుమార్ కలెక్టరేట్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా జేసీ శుభం బన్సల్‌ను కూడా కలిశారు.

చంద్రబాబు కోసం...



ముస్లిం పెద్దలతో కలిసి దువా చేస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహప్రవేశాన్ని పురస్కరించుకుని ముస్లిం మైనారిటీ పెద్దలు ఆయన కుటుంబ క్షేమాన్ని ఆకాంక్షిస్తూ అల్లాకు దువా చేశారు. టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు అన్సర్‌బాషా, సర్దార్‌బాషా, జాకిర్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబుకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి కలిగించాలని, శుభాలు కలగాలని దువా చేశారు.

రేపు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను ఆలయ ఆవరణలోని కొట్టు మండపం వద్ద ఉదయం 7గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

దళవాయి చెరువులో
మట్టిని తోడేస్తున్నారు..!
● స్థానికులు అడ్డుకున్నా ఆగని తరలింపు



ఎక్సకవేటర్లతో మట్టి తవ్వితీసి టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం



గుంతలమయమైన చెరువు

తిరుపతిరూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పుదిపట్ల రెవెన్యూ పంచాయతీలోని దళవాయి చెరువులో మట్టిని విచ్చలవిడిగా తోడేస్తున్నారు. రాత్రీపగలు తేడా లేకుండా ఎక్సకవేటర్లతో మట్టి తీసి టిప్పర్లతో తరలిస్తున్నారు. చెరువులో దాదాపు రెండు ఎకరాల విస్తీర్ణంలో 20 అడుగులమేర మట్టి తవ్వకాలు చేపట్టడంతో భారీ ఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నెల రోజులకుపైగా మట్టిని తవ్వితీసి తరలిస్తున్నా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల టిప్పర్లను అడ్డగించినా మట్టి రవాణా ఆగలేదని, తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. చెరువు రూపురేఖలు పూర్తిగా కోల్పోతోందని, ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులో బంకమన్ను పూర్తిస్థాయిలో తరలిపోయి కేవలం గులకరాళ్లు మాత్రమే మిగులుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా జాతీయ రహదారి విస్తరణ పనులకు మట్టిని తరలించేందుకు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్న నిర్వాహకులు మైన్స్ అధికారులకు రాయల్టీ చెల్లిస్తున్నామని అంటున్నారు. ఈ విషయమై రూరల్ మండల ఇరిగేషన్ ఏఈ రవిశంకర్‌ని వివరణ కోరగా జాతీయ రహదారి విస్తరణ పనులకు మట్టిని తోలేందుకు అనుమతి ఉంటుందని అంటున్నారు. మట్టి తవ్వకాలు నిలుపుదల చేయాలని సబ్ కాంట్రాక్టర్‌కు సూచించామని, అనుమతి పత్రాలు ఇవ్వాలని కోరామని అన్నారు. మంగళవారం చెరువును సందర్శిస్తామని వివరించారు.

వ్యర్థాలతో పూడిపోతున్న స్వర్ణముఖి
● దుర్గంధంతో అల్లాడుతున్న వాహన చోదకులు



చిగురువాడ స్వర్ణముఖి నదిపై వ్యర్థాలు

రామచంద్రాపురం, మే 26(ఆంధ్రజ్యోతి): కాలువలు, కుంటలు, నదులు పూడ్చకూడదనే నిబంధనలు పట్టినట్లు లేదు. ఇష్టానుసారంగా వ్యర్థాలతో చిగురువాడ వద్ద స్వర్ణముఖి నదిని కలుషితం చేస్తున్నారు. నీటి కాలుష్యంతో పాటు దుర్గంధం వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. తిరుపతి కార్పొరేషన్ చెత్తను ఆర్‌సీపురం మండలం రామాపురం డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. అక్కడకు పరిసర పంచాయతీల నుంచి చెత్త తరలించినా ఇబ్బంది లేదు. తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి చిగురువాడ స్వర్ణముఖి నది ఒడ్డున నిత్యం టన్నుల కొద్ది ఇళ్ల పడగొట్టిన వ్యర్థాలు, చెత్తాచెదారాలు తెచ్చి విడిచి వెళుతున్నారు. ఇప్పటి వరకు పర్లాంగ్‌దూరం 50 నుంచి వంద అడుగుల వెడల్పుతో నదిని పూడ్చి చదును చేశారు. ఇక్కడ తరలించిన వ్యర్థాలను కొందరు అవసరాలకు తీసుకెళుతున్నారు. దీంతో స్వర్ణముఖి వ్యర్థాలకు అడ్డాగా మారింది. శ్రీకాళహస్తి, తిరుచానూరు స్వర్ణముఖి నది తీరానే ఉన్నాయి. చిగురువాడ నుంచి ప్రవహించే ఈ నదినీటి స్నానమాచరిస్తే చర్మరోగాల బారిన పడే అవకాశం లేకపోలేదు. మరోపక్క ఇక్కడ చెత్త కుళ్లి దుర్వాసన వస్తోంది. వాహన చోదకులు ముక్కులు మూసుకుని వెళ్తున్నారు. వ్యర్థాలపై హెచ్చరిక బోర్డు ఉన్నా ఎవరూ లెక్కచేయడంలేదు. సంబంధిత అధికారులు నిఘా ఉంచి వ్యర్థాలను వేయకుండా అరికట్టాల్సి ఉంది.

నా కుమారుడి మృతిపై విచారించి.. న్యాయం చేయండి
● వెట్టి కార్మికురాలు అంకమ్మ

విజయవాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడి మృతిపై సమగ్రంగా విచారించి నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని తిరుపతి జిల్లాలోని చవటపాలెంకు చెందిన అంకమ్మ అనే మహిళా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ నగరం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆమె మాట్లాడారు. తొమ్మిదేళ్ల క్రితం భర్తతో కలిసి ఓ బాతుల వ్యాపారి వద్ద పనికి చేరామని, ఈ క్రమంలో వ్యాపారి నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నామని ఆమె చెప్పారు. మూడు నెలల కిందట అప్పు కోసం తమ 9 ఏళ్ల కుమారుడిని వ్యాపారి తీసుకెళ్లాడన్నారు. ఆ డబ్బు చెల్లించి కుమారుడిని తీసుకువచ్చేందుకు వెళ్లగా అక్కడ తమ కుమారుడు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించారు. బాలుడు అనారోగ్యంతో మరణించడంతో తమిళనాడులో పూడ్చినట్టు పోలీసులకు సమాచారం అందిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. వెట్టి విమోచన వేదిక కన్వీనర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో యానాది వంటి అణగారిన వర్గాల ప్రజలు బాండెండ్ లేబర్‌కు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వెట్టి బాండెడ్ లేబర్ బాధితుల కోసం ప్రత్యేక రాష్ట్రస్థాయి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వెట్టి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని కోరారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



పట్టణంలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పుల్లూరా ధరలు పతనం



చిత్తూరు సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): పుల్లూరు కాయలకు డిమాండ్ తగ్గిపోవడంతో ధరలు పడిపోయాయి. కాయలు పక్వానికి రాకపోవడం, కోతలు ఒక్కసారిగా చేపట్టడం ధరల పతనానికి కారణంగా తెలుస్తోంది. గత వారంలో టన్ను ధర రూ.12 వేలు పలికిన పుల్లూరు, మూడు రోజుల కిందట రూ.9 వేలకు చేరింది. సోమవారానికి దీని ధర రూ.7 వేలకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ ప్రతికూలతలు, వర్షాలు వచ్చాక పంట చేతికి అందదని భావించిన రైతులు కాయలు పక్వానికి రాక ముందే కోతలు చేపట్టారు. తొలుత ధరలు బాగున్నాయని భావించినా, మండీలకు పుల్లూరా పెద్ద సంఖ్యలో చేరడంతో ధరలు పతనమయ్యాయి. మరో వైపు పల్ప్ ఫ్యాక్టరీలు సైతం పుల్లూరా రకం కాయలను అడగకపోవడంతో ధరలు పతనం కావడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. బేనీషా టన్ను రూ.20వేల నుంచి రూ.30 వేల మధ్య పలుకు తుండగా, తాజాగా దీని ధర రూ.15 వేలకు పడిపోయింది. వర్షాలు పడితే కాయలకు పురుగుపడుతుందని భావించిన రైతులు ఒక్క సారిగా కోతలు మొదలు పెట్టడంతో చిత్తూరు, బంగారుపాళ్యం, దామల చెరువు మండీలకు మామిడి కాయలు పెద్ద సంఖ్యలో చేరుతున్నాయి. ఒక వైపు ఎగుమతులు లేకపోవడం, మరో వైపు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రస్తుత ధరలకు కొనుగోలు చేయపోవడంతో ధరలు పతనమవుతున్నాయి.

హెచ్‌ఎం బదిలీలకు 210 దరఖాస్తులు
- ఎంఈవో లాగిన్లకు ఎడిట్ ఆప్షన్

చిత్తూరు సెంట్రల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలో చేపడుతున్న టీచర్ల బదిలీ ప్రక్రియలో భాగంగా తొలిదశ సోమవారంతో కొలిక్కి వచ్చింది. ప్రధానోపాధ్యాయు (హెచ్‌ఎం)ల బదిలీల కోసం 210 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో 208 ఆమోదం పొందగా, రెండు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 181 ఖాళీలు ఉన్నాయి. యాజమాన్యాల వారీగా.. జడ్పీలో 155, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10, మున్సిపల్ కార్పొరేషన్‌లో 9, మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలల్లో ఏడు ఖాళీలున్నాయి. మంగళవారంతో హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ ముగియనుంది. ఇదిలా ఉండగా, నిబంధనలు అనుసరించి ఎడిట్ ఆప్షన్ ఎంఈవో లాగిన్లకు ఇచ్చారు. బదిలీల కోసం స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు దరఖాస్తు చేసుకునే క్రమంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకోవచ్చు. అయితే సమస్యల పరిష్కారంపై ఎంఈవోలు దృష్టి సారించక పోవడంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువంటి వారంతా డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఎంఈవోలు ఇలాగే వ్యవహరిస్తే షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సైతం జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

నేడు ఎస్‌ఏల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతికి ఎస్‌ఏల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మంగళవారం చేపట్టనున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల ఎస్‌ఏల సీనియారిటీ జాబితా డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. సీనియారిటీ జాబితా పరిశీలన 1:3 రేషియోలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జాబితాలోని ఎస్‌ఏలు విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీసు బుక్స్‌లతో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు చిత్తూరు లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పరిశీలనకు రావాలన్నారు. డిపార్టుమెంటల్ టెస్టు ఎంట్రీలను సర్వీసు బుక్‌లో నమోదయ్యేలా చూసుకోవాలని ఎస్‌ఏలకు డీఈవో సూచించారు.

వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు

ఐరాల(కాణిపాకం), మే 26 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని సోమవారం చిత్తూరు జిల్లా కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుణసారిక, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.ఇంద్రేష్ దర్శించుకున్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు.

10న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం?

● సిద్ధం చేయాలన్న ఆర్టీసీ ఎండీ

తిరుపతి(ఆర్టీసీ), మే 26(ఆంధ్రజ్యోతి): అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న వైద్యశాలను జూన్ 10వ తేదీన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన రూ.4కోట్లతో నిర్మిస్తున్న డిస్పెన్సరీ, విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో కాంట్రాక్టర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చేనెల తొలివారంలో పూర్తవ్వాలన్నారు. భవన నిర్మాణ వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. శ్రీవారి పాదాల చెంత నిర్మితమవుతున్న ఈ భవనం ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులకు సౌకర్యంగా ఉండాలన్నారు. సకల సదుపాయాలు కల్పించాలన్నారు. ఆహ్లాదకరంగా ఉండేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో పచ్చదనం పెంచాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కొరత లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. చివరి రెండు అంతస్తుల్లో విశ్రాంతి గదులు పూర్తిచేయడానికి మరో నెలన్నర పడుతుందని కాంట్రాక్టర్ తెలియగా ఆలోపే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు అప్పలరాజు, చెంగల్‌రెడ్డి, చంద్రశేఖర్, డీపీటీవో వెంకటరావు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్నకేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వైద్యశాల నిర్మాణంపై ఆరా తీస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు

రుయాలో ప్రత్యేక టీబీ నిర్ధారణ కేంద్రం


టీబీ స్క్రీనింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిప్రభు

తిరుపతి(వైద్యం), మే 26 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారిని క్షయ నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టడం శుభ పరిణామమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు పేర్కొన్నారు. వైద్యులు, వైద్య ఉద్యోగుల కోసం రుయాస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి క్షయ వ్యాధి బాధితుల నుంచి వెంటనే వస్తుందని, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం ఏఆర్ఎంవో హరికృష్ణ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడమేగాక టీకా వేసుకుని వైద్య సిబ్బందికి స్ఫూర్తినిచ్చారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాధ, పల్మనరీ విభాగాధిపతి సుబ్బారావు, డీసీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సీపీఎల్


మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న గిరీష్‌రెడ్డి, పృథ్వీరాజ్

తిరుపతి(క్రీడలు), మే 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీయూ మైదానంలో చిత్తూరు ప్రీమియర్ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ఉదయం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాయ్‌వైస్రాయ్ జట్టు 20 ఓవర్లకు 175/9 స్కోరు చేసింది. అనంతరం బరిలోకి దిగిన స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో 139పరుగులకే ఆలౌటై ఓటమి పాలైంది. పాయ్‌వైస్రాయ్ జట్టు ఆల్‌రౌండర్ గిరీష్‌రెడ్డి 16పరుగులు, 4 వికెట్లు పడగొట్టి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డుకు ఎంపికై అతిథులు డాక్టర్ జయప్రసాద్, ఈసీ మెంబర్ శివప్రసాద్ చేతుల మీదుగా అందుకున్నాడు. వర్షం కారణంగా మధ్యాహ్నం మ్యాచ్‌ను 16 ఓవర్లకు కుదించారు. రాయల్ ఛాలెంజ్ తిరుచానూరు జట్టు 16ఓవర్లలో 161/4 స్కోరు చేసింది. శశాంక్ శ్రీనివాస్ 45బంతుల్లో 7చొప్పున సిక్సర్లు, ఫోర్లతో 93పరుగులు సాధించాడు. అనంతరం బరిలో దిగిన హైపీరియన్ జట్టు 14.5 ఓవర్లకే లక్ష్యం ఛేదించింది. ఈ జట్టు సభ్యుడు పృథ్వీరాజ్ 89పరుగులు చేసి అతిథులు డాక్టర్ ప్రవీణ్, కోచ్ అనిత నుంచి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నారు.

బైపాస్ రోడ్లపై బైక్ రేసులు

- ఐదుగురికి కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

తిరుపతి(నేర విభాగం), మే 26 (ఆంధ్ర జ్యోతి): తిరుపతి చుట్టుపక్కల బైపాస్ రోడ్లపై రేసులకు, స్టంట్లకు పాల్పడుతున్న ఐదుగురు యువకులకు పోలీసులు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. శ్రీనివాసమంగాపురం, గరుడ వారధి, 100 ఫీట్ రోడ్డు, చంద్రగిరి హైవేలపై పలువురు బైక్ రేసులు, స్టంట్‌లు చేస్తున్నట్టు పోలీసులకు ఫిర్యాదులు రావడంతో నిఘా వేసి ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో వారి అకౌంట్లను డిలీట్ చేయించారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. రాత్రిపూట బయట తిరగడం నియంత్రించాలని సూచించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం


సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. సోమవారం పీఎల్ఆర్ కన్వెన్షన్ హాలులో తిరుపతి, చిత్తూరు జిల్లాల నియోజకవర్గ సమన్వయకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ కేసులు పెడుతోందని, వాటికి భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయికి తీసుకెళుతూ అదే సమయంలో కార్యకర్తలకు, నాయకులకు సమన్వయకర్తలు అండగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి ఆర్కే రోజా, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఉమ్మడి జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు మేడా రఘునాథరెడ్డి, చావా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో మౌలిక వసతులు కల్పిస్తాం


శిల్పారామాన్ని సందర్శిస్తున్న చైర్‌పర్సన్ మంజులారెడ్డి

తిరుచానూరు, మే 28(ఆంధ్ర జ్యోతి): శిల్పారామంలో సందర్శకుల కోసం మరిన్ని వసతులు కల్పిస్తామని ఏపీ శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి అన్నారు. సోమవారం ఆమె తిరుచానూరు రోడ్డులోని శిల్పారామాన్ని సందర్శించారు. శిల్పారామం అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగీ కృషి చేయాలన్నారు. సందర్శకుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆమెను కలిసి నగరిలో శిల్పారామం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), మే 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక లక్ష్మీపురం సర్కిల్లో సోమవారం చోటు చేసుకుంది. ఈస్ట్ ఎస్‌ఐ రామాంజులు కథనం మేరకు.. తిరుపతికి చెందిన శ్రీనివాసులు ఎయిర్ బైపాస్ రోడ్డు నుంచి లక్ష్మీపురం సర్కిల్ వైపు కారులో వస్తున్నాడు. అదే సమయం లో లక్ష్మీపురం సర్కిల్‌లో కాపురమున్న చలపతి స్కూటీపై ఇంటికి ముందు వెళుతున్నాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి ముందు వెళుతున్న స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీలో వెళుతున్న చలపతి ఎడమ కాలికి బలమైన గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


తిరుపతిలోని డీఎస్ఆర్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారం రాములవారి గుడిలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 60మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మహానాడుకు ఉచిత అంబులెన్సులు


స్విమ్స్ నుంచి మహానాడుకు బయల్దేరిన అంబులెన్సులు

తిరుపతి(వైద్యం), మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ కడపలో మూడు రోజులపాటు నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్విమ్స్‌లోని శ్రీబాలాజీ అంబులెన్స్ సర్వీస్ సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 17 అంబులెన్సులు సోమవారం వెళ్లాయి. అంబులెన్సులో అత్యవసర వైద్య సహాయం అందించే అనుభవజ్ఞులతోపాటు అవసరమైన మందులను తీసుకువెళ్లారు. మూడు రోజులపాటు అంబులెన్సులు అక్కడే ఉండి అవసరమైన వైద్య సహాయ సహకారాలు అందిస్తాయని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. అంబులెన్సుల డ్రైవర్లు, సహాయకులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు.

ఆటిజం సెంటర్‌కు భవన పరిశీలన


మంగళం ట్రెండ్స్ పాఠశాలను సందర్శిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటుకు మంగళం ట్రెండ్స్ పాఠశాలలో సోమవారం సమగ్ర శిక్షసహిత విద్యా సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేశవులనాయుడుతో ఆటిజం సెంటర్ గురించి చర్చించారు. ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థికసాయం, అలవెన్సులు వారి తల్లిదండ్రుల ఖాతాలోకి జమజేస్తున్నట్లు వివరించారు. 18 ఏళ్లలోపు పిల్లలు చదువుకోకుండా ఉంటే వెంటనే పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవానీ, జ్ఞానమ్మ, హేమలత పాల్గొన్నారు.

యోగాంధ్ర ప్రచారం ప్రారంభం

తిరుపతి(క్రీడలు), మే 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంకల్పించిన యోగాంధ్ర ప్రచారం సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 30వ తేదీ వరకు నగర పరిధిలోని 50 డివిజన్లలో సోలో, యోగా, అసనాస్, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం కొనసాగనుంది. మంగళం పరిధిలో మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. జూన్ 2నుంచి 7వ తేదీ వరకు యోగా ద్వారా ఐక్యత, జిల్లా స్థాయిలో 9నుంచి 14వరకు యోగా, యువత-ఆరోగ్య భవిష్యత్ నిర్మాణం, 16 నుంచి 18 వరకు యోగాంధ్ర, ఆంధ్రప్రదేశ్ గ్లోబల్ యోగా ప్రదర్శన ఉంటుంది. ప్రతిభ కనబరిచిన వారు గ్రామ స్థాయి నుంచి మండల-నగరపాలక స్థాయి నుంచి జిల్లాకు, ఇక్కడ నుంచి రాష్ట్రస్థాయి ఫినాలేకు ఎంపికవుతారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

చంద్రగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లిం, క్రిస్టియన్ నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నం ఒక ప్రకటనలో కోరారు. గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముస్లిం మైనారిటీలు కుల ధ్రువీకరణ పత్రం లేకుండా కేవలం రేషన్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


ధనుంజయులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ కామర్స్ పరిశోధకుడు ఎ.ధనుంజయులు డాక్టరేట్ పొందారు. పర్ఫార్మెన్స్ ఎవల్యూషన్ ఆఫ్ సెలెక్ట్ బీఎస్ఈ-లిస్టెడ్ సిమెంట్ కంపెనీస్ ఇన్ ఇండియా అంశంపై ప్రొఫెసర్ కె. జయచంద్రారెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


గ్రంథాలయానికి పుస్తకాలను అందజేస్తున్న వీసీ రాణిసదాశివమూర్తి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ గ్రంథాలయానికి వీసీ ఆచార్య రాణిసదాశివమూర్తి పుస్తకాలు వితరణ చేశారు. తాను వ్యక్తిగతంగా సేకరించిన 300 విలువైన గ్రంథాలను సోమవారం అందజేశారు. వీటిలో వేద, ఆగమ, అనువాద, వ్యాఖ్యాన గ్రంథాలతో పాటు నిఘంటువులు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భాస్కరుడు, ప్రొఫెసర్ వెంకట రాధేశ్యాం పాల్గొన్నారు.

గుజిరీ వ్యాపారులకు స్థలాలు కేటాయించాలి


మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మే 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని పేద గుజిరీ వ్యాపారులకు ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో నగర గుజిరీ వ్యాపారుల మొదటి మహాసభల ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజలు వేస్తున్న వ్యర్థాలను తొలగించే కార్యక్రమంలో భాగస్వాములవుతున్న గుజిరీలకు ప్రభుత్వం స్థలాలను కేటాయించాలని కోరారు. స్క్రాప్ తీసుకునే వారిపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. గుజిరీల సమస్యల పరిష్కారానికి మహాసభ జూన్ 20న నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.రాజా, గుజిరీ వ్యాపారుల సంఘం నాయకులు దాము, అల్లాబకష్, రాము, బాలన్, అలీబాషా, శ్రీరాములు, అజీమ్, రాధాలత, మురళి, షకూర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ పీజీఆర్ఎస్‌కు 37 వినతులు


సమస్యలు వింటున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37 వినతులు వచ్చాయి. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్ర నారాయణ, కార్పొరేటర్లు శైలజ, నరసింహాచారి, నరేంద్ర కమిషనర్‌ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, నెహ్రూవీధిలో ఇంటి కొళాయి తొలగించినా బిల్లు వస్తోందని, వైఎస్సార్ మార్గ్‌లో టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, రాఘవేంద్రనగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రవీంద్రనగర్, వెంకటేశ్వర కాలనీలో సీసీ రోడ్లు, నీటి సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. మధురానగర్‌లో కొద్దిపాటి వర్షానికే నీరు చేరుతున్నాయని, కొరమేనుగుంటలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, చంద్రశేఖర్ కాలనీలో యూడీఎస్ పొంగుతోందని, చెన్నారెడ్డి కాలనీలో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని, సాయి విష్ణు లేఅవుట్‌లో ఆక్రమణలను నివారించాలని వినతులు వచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసికుమార్, గోమతి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, డీసీపీ మహాపాత్ర పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. నగదు కాజేసి

తిరుపతి(నేరవిభాగం), మే 26 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు మార్చేసి రూ.15వేలు నగదు కాజేసిన ఘటన సోమవారం టీటీడీ పరిపాలనా భవనం వద్ద చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసుల వివరాల మేరకు... టీటీడీలో పనిచేస్తున్న వేలు భార్య సంగీత నగదు డ్రా చేసేందుకు పరిపాలనా భవనం వద్ద ఉన్న యూనియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు వెళ్లింది. ముందుగా రూ.20వేలు డ్రా చేసింది. ఆ తర్వాత రూ.15 వేలు డ్రా చేయగా నగదు రాలేదు. ఇంతలోనే వెనుక ఉన్న వ్యక్తి తాను ప్రయత్నిస్తానని చెప్పి చాకచక్యంగా ఆమె ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. డబ్బు రాలేదని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొంత సేపటికి అదే ఏటీఎంలో రూ.5వేలు డ్రా చేశాడు. మరో మూడు గంటల తర్వాత చిత్తూరు కేఆర్ ఫిల్లింగ్ స్టేషన్ వద్దనున్న ఏటీఎంలో రూ.10వేలు డ్రా చేశాడు. వీటికి సంబంధించి బాధితురాలు మొబైల్ నంబరుకు మెసేజ్ రావడంతో తన అకౌంటులో ఉన్న డబ్బును భర్త అకౌంటుకు పంపించింది. బ్యాంకు అధికారుల సూచన మేరకు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



తిరుపతి(నేరవిభాగం), మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతి యశోదనగర్‌కు చెందిన మహిళ సోమవారం అదృశ్యమైంది. ఎస్‌ఐ అజిత వివరాల మేరకు.. యశోదనగర్‌లో లోకేష్, భవానీ దంపతులు కాపురముంటున్నారు. భర్తతో మనస్పర్థల కారణంగా భవానీ ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కోసం వెతికినా లాభం లేకపోవడంతో సోమవారం లోకేష్ అలిపిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ అజిత కేసు నమోదు చేశారు.

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

● మృతదేహాలను బంధువులకు అప్పగించాలి
● సీపీఐ నేత హరినాథరెడ్డి డిమాండ్


మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నేత హరినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జరిపిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, వారి మృతదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించి అటవీ ప్రాంతాల్లో ఉన్న గిరిజన ఆదివాసీయులను, మావోయిస్టులను హతమారుస్తోందన్నారు. ప్రధాన మంత్రి, హోంమంత్రి ఈ హత్యలను సమర్థించడం ఆటవిక చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ హత్యాకాండను తమ పార్టీ ఖండిస్తోందన్నారు. అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీయులను కనుమరుగు చేసి అక్కడ ఉన్న ఖనిజ సంపదను కార్పొరేటర్లకు అప్పగించడానికి కగార్ ఆపరేషన్ చేపట్టిందని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించి మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే స్పందించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు సి.పెంచలయ్య, కె.రాధాకృష్ణ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

జేసీకి సన్మానం


జేసీ శుభం బన్సల్‌ను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

తిరుపతి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జేసీ శుభం బన్సల్‌ను తిరుపతి జిల్లా రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండీయూ వ్యవస్థను రద్దు చేసినందుకు సన్మానించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా డీఎస్వో శేషాచలంరాజు, సీఎస్‌డీటీ జయరాజ్, భాస్కర్, తిరుపతి జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, అర్బన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోటేశ్వరరావు, హేమలత, రాజేశ్వరమ్మ, శ్రీనాథ్, పుష్పాంజలి, 34 మండలాలకు చెందిన డీలర్లు పాల్గొన్నారు.

కడప నుంచి తిరుపతికి ఇద్దరు డాక్టర్ల బదిలీ

తిరుపతి(వైద్యం), మే 26(ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీ యామినిని తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు, కడపలోని వేంపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యు.బి.లక్ష్మీప్రియను జిల్లాలోని గొల్లపల్లికి పీహెచ్‌సీకి బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవో(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తున్న వై.పద్మజను ఎస్వీ వైద్య కళాశాల ఏవోగా బదిలీ చేశారు.

మహానాడును జయప్రదం చేయండి


మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(ఆటోనగర్), మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి ప్రారంభం కానున్న టీడీపీ మహానాడు సభలకు నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ కోరారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా మహానాడును నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈనెల 28న ప్రతినిధుల సమావేశంలో ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి తదితర అంశాలపై నిర్ణయాలు జరుగుతాయన్నారు. 29న బహిరంగ సభ ఉంటుందని, సభకు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని కోరారు. గత ఐదేళ్లలో నెల్లూరు జిల్లాలో మైనింగ్ తవ్వకాల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, అందులో భాగంగానే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్ట్ చేయడం జరిగిందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపడుతోందన్నారు. ఈతమాకుల హేమంత్‌కుమార్, కరాటే చంద్ర, భరణీయాదవ్, జయరామ్‌యాదవ్, మహేష్, సుకుమార్, జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్



సురేఖవాణి

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి రావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, సినీనటి సురేఖవాణి, కర్ణాటకకు చెందిన మల్లిఖార్జున ముత్యా(అప్పాజీ), హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మెన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు.



కొండ విజయ్‌కుమార్, మల్లిఖార్జున ముత్యా

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,538

తలనీలాలు సమర్పించినవారు: 37,339



ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 268 ఫిర్యాదులు ● ప్రజాసంఘాల ధర్నాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని, పరిష్కారం కానివాటికి కారణాలు చెప్పాలని కలెక్టర్ సూచించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్‌కు 268 అర్జీలు అందగా అందులో వివిధ భూసమస్యలపై 150 వినతులు రెవెన్యూశాఖకే రావడం గమనార్హం. వచ్చిన సమస్యల్లో కొన్ని..

గుట్ట కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని సీపీఎం నేతలు జయచంద్ర, సుమన్ డిమాండు చేశారు. ఈ మేరకు వీరు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ బాలుర వసతిగృహం వద్ద మట్టిని తవ్వి వందలట్రిప్పులు తీసుకెళుతున్నారన్నారు. దీంతో రామాపురం నుంచి పచ్చికాపల్లం వరకు కొండలన్నీ మాయమై పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఒక ట్రిప్పు ఎర్రమట్టిని సుమారు రూ.30వేలకు అమ్ముకుంటున్నారన్నారు. ఇక ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎర్రమట్టి అక్రమ రవాణాదారులు, గుట్టలు చదునుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

వాకాడు చెరువును చెరబట్టారు

కొంతమంది ఆక్రమణదారులు వాకాడు చెరువును కబ్జాచేసి వ్యవసాయం చేస్తుండటంతో నీటిపారుదల ఆగిపోయిందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దారు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని వెంకటశేషయ్య, నాగరాజు, హరి, జనార్దన్, రమణయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి చెరువును కాపాడాలని కోరారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



ఎస్టీ వర్గీకరణచేసి యానాదులకు న్యాయం చేయండి

ఎస్టీ వర్గీకరణ చేసి యానాదులకు న్యాయం చేయాలంటూ యానాది రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. గిరిజన జాతుల్లో జనాభాపరంగా మొదటి స్థానంలో ఉన్న యానాదులు ఇప్పటికీ వెనుకబడి ఉన్నారని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచులయ్య అన్నారు. ఎస్టీ వర్గీకరణతోనే యానాదులు అభివృద్ధి చెందుతారన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సుబ్బారావు, బాపట్ల బ్రహ్మయ్య, తలపల మల్లికార్జున, వెంకటరమణ, చెంగల్రాయులు, రామయ్య, రేవతి, రాములమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి



జిల్లాలో మామిడికి గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తోతాపురికి కిలో రూ.15 కనీస ధర కల్పించాలన్నారు. ఏ రోజు ధరలు ఆరోజు మార్కెట్‌లో ప్రదర్శించాలని డిమాండు చేశారు. సాగు భారమై రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ధరలు పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలని చంద్రశేఖర్, రాము తదితరులు కోరారు.

సర్‌ఛార్జీ, స్టాంప్‌డ్యూటీ నిధులు చెల్లించాలి



తిరుపతి రూరల్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో భూమి, ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి పంచాయతీలకు రావాల్సిన సర్‌ఛార్జీ, స్టాంప్ డ్యూటీ నగదు రెండేళ్లుగా విడుదల చేయడంలేదని సాయినగర్ సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరెడ్డి కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి నెలా జరిగే రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ, సర్‌చార్జీ నగదును క్రమం తప్పకుండా పంచాయతీలకు అందించాలన్నారు.

'విశాఖ' స్టీల్‌లో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన 4వేల మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు హరినాథరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించకుండా ప్రైవేటు పరిశ్రమలకు కేటాయించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్పొరేట్ కంపెనీలకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ప్రయత్నాలను మోదీ ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఐ నేతలు రాధాకృష్ణ, జయచంద్ర, రాజా, లోకేష్, సుబ్రమణ్యం, మాధవ్‌కృష్ణ, వేణుగోపాల్, బుజ్జి, చిన్న యాదవ్, యుగంధర్, సాయి లక్ష్మి, సుమన్, చిన్నం పెంచులయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీసిటీ అధికారులతో థాయ్ బృందం

శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ రాచా ఆరిబార్గ్ తన సతీమణి నరపాన్ ఆరిబార్గ్‌తో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేశారు. వారికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం, వ్యాపార ప్రయోజనాల గురించి వారికి వివరించారు. భారత్ - థాయ్‌లాండ్ మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ పర్యటన కీలకపాత్ర పోషిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. థాయ్ కాన్సుల్ జనరల్ తన పర్యటనలో భాగంగా తొలి రోజు శ్రీసిటీ అధికారులతో చర్చలు, సెజ్ పరిసరాలతో పాటు థాయ్ పరిశ్రమలైన రాక్‌వర్త్, మాండలెజ్ పరిశ్రమలను సందర్శించి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

రేపు బర్డ్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకున్న డైరెక్టర్ ఛాంబర్‌ను సిద్ధం చేశారు. ఈనెల 28న బర్డ్‌ను స్థాపించిన దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి జగదీష్ బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

శ్రీకాళహస్తి,మే26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కదలికలపై పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారిలో గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మాటు వేసి ముగ్గురుని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

రైలు ఢీకొని పాడి రైతు మృతి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని పాడిరైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (59) అనే రైతు గేదెలను వెతికే క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నాగయ్యకు వినికిడిలోపం ఉండడంతో రైలు రావడాన్ని గుర్తించకపోవడంతో ప్రమాదానికి గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీలకు సంబంధించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్వయం ప్రతిపత్తి గల ఈ రెండు కాలేజీలు సొంతంగానే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించాయి. ఫలితాలను ఆయా కాలేజీల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఫలితాలు ఎస్‌వీఏసీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 88.05 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ప్రకటించారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో 92 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు - కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్ కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఈలు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్యాడర్లలో ఐదేళ్లు పూర్తి కాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరి కొందరు అధికారుల దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు స్థానాలను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులను వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులకు, ఉద్యోగులకు కూడా చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్.. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.




కౌన్సెలింగ్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు

ఎస్‌ఐల బదిలీలకు కసరత్తు పూర్తి

త్వరలో భారీ ఎత్తున స్థానచలనం

తిరుపతి(నేరవిభాగం), మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ ఎత్తున కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్‌ఐల బదిలీలు జరగ్గా.. ఇప్పుడు ఎస్‌ఐల వంతు వచ్చింది. ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, వారం రోజుల్లో సుమారు 80 మందికిపైగా ఎస్‌ఐలు బదిలీ కావచ్చని పోలీసు వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కొందరు ఎస్‌ఐల పనితీరు, వ్యవహార శైలి వివాదాస్పదంగా ఉండటంతో.. అలాంటి వారికి స్థానచలనం తప్పదని తెలుస్తోంది. జిల్లాలోని పలువురు ఎస్‌ఐలపైన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అవినీతి అక్రమాలకు పాల్పడడం, సివిల్ పంచాయితీలు చేయడం వంటి అనేక ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారి పనితీరుపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆగ్రహంతో ఉన్నట్లు తెలిసింది. ఎస్‌ఐల బదిలీల్లో పనితీరు, క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చేలా కసరత్తు జరిగినట్లు సమాచారం. తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు స్టేషన్ల ఎస్‌ఐల్లో దాదాపు ఐదుగురికి బదిలీలు ఉంటాయనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఒకరి బదిలీ జరిగింది. రేణిగుంట సర్కిల్‌లో రెండేళ్లుగా పనిచేస్తూ పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఎస్‌ఐపై వేటు తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. అలాగే, పుత్తూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, బుచ్చినాయుడు కండిగ, కేవీబీ పురంలలో ఇటీవల జరిగిన రెండు సంఘటనలను ఎస్పీ పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇక, ఫిర్యాదుదారుల నుంచీ ఎస్‌ఐలపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని స్థానచలనం కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఇక, పుత్తూరులో జరిగిన బియ్యం మాఫియా వెనుక ఉన్న ఓ ఎస్‌ఐపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిసింది. విధి నిర్వహణను పక్కన పెట్టి సంపాదనపైనే దృష్టి సారిస్తున్న వారిని దూరప్రాంతాలకు సాగనంపే అవకాశం ఉంది.

అల్లకల్లోలంగా సముద్రం



తూపిలిపాళెం సముద్ర తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వాకాడు మండలం తూపిలి పాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తూపిలిపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, వైట్‌కుప్పం తీరాలలో వాయుగుండం ప్రభావంతో సముద్రం ముందుకువచ్చిందని మత్స్యకారులు సోమవారం తెలిపారు. వాయుగుండం ప్రభావంతో రెండు గంటలపాటుగా ఎడతెరపిలేకుండా వర్షం పడింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

పసుపు పండుగకు తరలిరండి: టీడీపీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ

గూడూరు/ నాయుడుపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి గురువారం వరకు మూడు రోజులపాటు జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నిర్వహించిన మినీమహానాడు విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరూ కృషిచేశారన్నారు. ఇదే స్ఫూర్తితో మహానాడు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. నియోజకవర్గ పరిధి నుంచి 5వేల మందికి పైగా మహానాడుకు తరలివచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, కిషోర్‌నాయుడు, పురుషోత్తంరెడ్డి, శివకుమార్, పెంచలయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు రేషన్ డీలర్ల సన్మానం

రేషన్ డీలర్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి రేషన్ దుకాణాల ద్వారా సరుకులు అందజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. డీలర్లు సక్రమంగా సరుకులను అందజేయాలని సూచించారు.

పండుగలా మహానాడు

పండగ వాతావరణంలో మహానాడును నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రాష్ట్రాన్ని శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కడప జిల్లాలో ఈ నెల 27, 28, 29 తేదీలలో జరగబోవు మహానాడుకు నియోజకవర్గం నుంచి 5వేల మంది తరలివెళ్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నియోజకవర్గంలోని అందరూ మహానాడులో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రమేష్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులునాయుడు, శంకరయ్య, సుధాకర్, ప్రసాద్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సెల్వం, పళణి, రాజేంద్ర, సంచికృష్ణయ్య, సుధీర్ పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి


రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దారు చంద్రశేఖర్

గూడూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు లబ్ధిదారులకు పారదర్శకంగా రేషన్ సరుకులను అందజేయాలని తహసీల్దారు చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గూడూరు పట్టణ, మండల ప్రాంతాల్లోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి ప్రభుత్వం రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్ దుకాణాల్లోనే సరుకులు అందజేసేలా చర్యలు తీసుకుందన్నారు.

మహిళలు మామోగ్రామ్ చేయించుకోవాలి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): మహిళలంతా మమోగ్రామ్ చేయించుకోవాలని వైద్యాధికారి లియోనా అన్నారు. సోమవారం మండలంలోని నిడిగల్లు, అమిలిమి పంచాయతీలతో తిరుపతిలోని స్విమ్స్ ఆధ్వర్యంలో పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రొమ్ముక్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు 35 ఏళ్లు దాటిన ప్రతిమహిళ మామో గ్రామ్ పరీక్ష చేయించుకోవడం మంచిదన్నారు. ఆయా పంచాయతీల్లో 196 మందికి ఈ పరీక్షలను నిర్వహించామన్నారు. 29వ తేదీన గొట్టికాడు, నిండలి గ్రామాల్లో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గాయత్రి, దొరబాబు, పద్మావతి, చైతన్యభాను, చంద్రమోహన్, స్థానిక నాయకులు రఘురెడ్డి, ముని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన హనుమజ్జయంతి


గ్రామోత్సవంలో ఊరేగుతున్న హనుమంతుడు

సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరు పేటలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం హనుమంతుడికి పలు రకాల పండ్లతో అలంకారం చేశారు. ఉదయం అభిషేకానంతరం పూజలు చేశారు. రాత్రి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వాకచర్ల రమేష్, రాధాకృష్ణ బట్టా సుబ్రమణ్యం కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాళంగి నదిలో మృతదేహం వెలికితీత

మృతుడు గాండ్లవీధికి చెందిన సుబ్రమణ్యం



సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): కాలంగి నదిలో పడి చనిపోయిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు సోమవారం వెలికి తీశారు. ఆదివారం సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగి నది వంతెన గోడను ద్విచక్ర వాహనం ఢీకొని ప్రమాద వశాత్తు నదిలో ఓ వ్యక్తి పడిపోయిన విష యం తెలిసిందే. ద్విచక్ర వాహనం నెంబరు ఆధారంగా పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృతుడు సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధికి చెందిన పి.సుబ్రమణ్యం (27)గా గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడడంతో నదిలో గాలింపు చర్యలు నిలిపివేశారు. సోమ వారం ఉదయం బంధువులు, పోలీసులు కాళంగిలో గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికితీశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల డాడిలో చుక్కల దుప్పికి గాయాలు



చిట్టమూరు, మే 26(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాకసిరి అటవీ ప్రాంతంలో సోమవారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి గాయపడింది. యాకసిరి చెంగాళమ్మ మాను సమీపంలోని తెలుగుగంగ కాలువ వద్ద చుక్కల దుప్పి ప్రమాదవశాత్తు పొలం వద్ద ఏర్పాటు చేసిన తంతికి తగిలి లేవలేని స్థితిలో పడిపోయింది. అక్కడే ఉన్న కుక్కలు దుప్పిపై దాడి చేస్తుండగా ఆదారిలో వస్తున్న ఉపాధి ఈసీ శరత్ కుమార్ గుర్తించి కుక్కల బారి నుంచి దుప్పిని రక్షించారు. ఈలోగా అది ఆందోళనకు గురైన దుప్పి పక్కనే ఉన్న తెలుగుగంగ కాలువలో పడిపోయింది. దీంతో ఆయన వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో వచ్చి దుప్పిని రక్షించారు. ఆటోలో తరలించి గాయాలకు వైద్యం చేయించారు. అనంతరం అడవిలో వదిలేశారు.

టీడీపీ నాయకులకు గుణపాఠం తప్పదు: వైసీపీ


మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరిటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): అక్రమ కేసులు బనాయిస్తున్న టీడీపీ నాయకులకు గుణపాఠం తప్పదని తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వెంకటగిరి జ్యుడిషియల్ కోర్టుకు తరలించడంతో ఆయనకు మద్దతుగా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పుడు కేసులకు ఫలితం అనుభవిస్తారని పేర్కొన్నారు. కాకాణి కడిగినముత్యంలా బయటకు వస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, సూళ్లురుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వైసీపీ నాయకులపై కేసులు పెట్టుకోండి...దానికి రెండింతలు తిరిగి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

అధ్యాపకులకు ఏఐపై శిక్షణ

గూడూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ విభాగంలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో వస్తున్న మార్పులపై ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు సులభతరమైన బోధనను అందించేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దత్తాత్రేయశర్మ, విశ్వక్సేనారెడ్డి, నీరజ, శక్తిమురుగన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విందూరు రోడ్డును అభివృద్ధి చేయాలని వినతి

గూడూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి విందూరు గ్రామం మీదుగా గిద్దలూరుకు వెళ్లేరోడ్డును అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఈ రోడ్డును అభివృద్ధి పరచకపోవడంతో 15 గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారని తెలియజేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్‌లోని సాయినగర్‌లో మోటార్‌బైక్ చోరీపై కృష్ణ అనే యువకుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సాయినగర్‌లో నివాసం ఉంటున్న తన యూనిక్రాస్ ద్విచక్ర వాహనాన్ని ఇంటిబయట ఉంచగా చోరీకి గురైందని తెలియజేశాడు. ఓ వ్యక్తి చోరీ చేసినట్లు తమ ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాల ద్వారా గుర్తించామని వివరించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పవన్‌కుమార్ తెలిపారు.

రొయ్యలగుంటల వద్ద కూలీ మృతి

చిల్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపాళెం రొయ్యల గుంటల వద్ద ఓ కూలీ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... శ్రీకాకుళానికి చెందిన అప్పన్న(35) బెస్తపాళెంలోని రొయ్యల గుంటల వద్ద కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తోటి కూలీలతో కలిసి నిద్రించాడు. సోమవారం ఉదయం ఎంతకీ నిద్ర లేవలేదు. మృతిచెందినట్లు గుర్తించి సహచర కూలీలు యజమానికి తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం అందించాడు. అప్పన్న గుండెపోటుతో కానీ, పాముకాటుతో కానీ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించాలి

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రహదారి నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ స్వప్న సూచించారు. ఓజిలి ఆర్‌అండ్‌బీ రహదారిపై సోమవారం ఆమె వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలతోపాటు, డ్రైవింగ్ లైసెన్సు, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. మలుపులు, ఇతర జనావాస ప్రాంతాలలో తక్కువ వేగంతో వెళ్లాలని తెలియజేశారు.

ఇంటిస్థలాలు కేటాయించాలని వినతి


తహసీల్దారు శరత్‌బాబుతో మాట్లాడుతున్న గ్రామస్తులు

తడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : తమకు పూడికుప్పం గ్రామం వద్ద ఇళ్లస్థలాలు కేటాయించాలని ఇరకంకుప్పం గ్రామస్తులు తహసీల్దారు శరత్‌బాబును కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు పూడికుప్పంలో ఇళ్లస్థలాల కేటాయింపునకు కలెక్టర్ అనుమతించారని, పూడి పంచాయతీ సర్పంచ్ పరమశివంరెడ్డి కోర్టుకు వెళ్లినా న్యాయస్థానం కూడా తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం తహసీల్దారు స్పందిస్తూ పూడికుప్పంలో సుమారు 7 ఎకరాల భూముల్లో 175 మందికి ఇళ్లస్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. త్వరలో ఆ పనులు పూర్తిచేస్తామని అన్నారు. తహసీల్దారుతో సమావేశమైన వారిలో ఇరకంకుప్పం మత్స్యకార నాయకులు వాసు, వినోద్, పరమన్ తదితరులు ఉన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం

● వేలూరు మురళీకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వేలూరు మురళీకృష్ణారెడ్డి

పెళ్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో చేపడుతున్న మహానాడును విజయవంతం చేసేందుకు భారీగా తరలివెళ్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరులోని టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టీడీపీ నేతలతో కలసి మహానాడుకు వెళ్లేందుకు జనసమీకరణపై చర్చించారు. ఈ సందర్భంగా పేరం రమేష్‌నాయుడు మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీనేత కొండేపాటి గంగాప్రసాద్ ఆధ్వర్యంలో పెళ్లకూరు మండలం నుంచి మహానాడుకు 25 నుంచి 30 వాహనాలలో కార్యకర్తలను సమీకరిస్తున్నామన్నారు. మహానాడు విజయవంతం చేసేందుకు మంగళవారం ఉదయం 6.30 గంటలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పెళ్లకూరు గ్యాస్ గోడౌన్‌కు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమలో టీడీపీ నాయకులు శిరసనంబేటి చైతన్య కృష్ణారెడ్డి, కలవకోలు మునీష్, కొచ్చెర్ల వెంకటరమణనయుడు (కేవీనాయుడు), నర్రావుల లోకేష్‌నాయుడు, పేరం సదీప్‌తేజ తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

వాకాడు, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిడిగుర్తి పంచాయతీ పరిధిలో 3వేల కుటుంబాలకు తాగునీటి సమస్య నెలకొనడంతో సోమవారం సుమారుగా 100 మందికి పైగా తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తహసీల్దారు రామయ్యకు, ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిడిగుర్తి పంచాయతీ పరిధిలో వల్లమేడు, నిడిగుర్తి, గొల్లపాళెం, బాలాజీనగర్, వేణుగోపాలపురం, శ్రీహరిపురం, నిమ్మవానిదిబ్బ గ్రామాలలోని భూముల్లో ఉప్పుపొరలు కలిగి ఉండటంతో వందల అడుగుల బోర్లువేసినా తాగునీరు దొరకడం లేదన్నారు. మనపాళెం ప్రాంతంలో బోర్లను వేసి నీటి సమస్య ఉన్న గ్రామాలకు తరలిస్తున్నప్పటికి వేసవి కాలంలో బోర్లల్లో నీరు అడుగంటిపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని తెలియజేశారు. మనపాళెం పరిసరాలలో ప్రభుత్వ భూములను పలువురు ఆక్రమించుకొని అడుగడుగునా బోర్లు వేసి వేరుశనగ, పుచ్చ తదితర పంటలను చేపడుతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా గ్రామాల తాగునీటి సమస్య పరిష్కారం కోసం వేసిన బోర్లలో నీటి సమస్య ఏర్పడుతోందని తెలిపారు. అధికారులు చొరవచూపి నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగజ్యోతి, సర్పంచ్ నాగరాజులు మనపాళెం వద్ద బోరు పాయింట్‌ను వేశారు.


తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన నిడిగుర్తి గ్రామ ప్రజలు, మనపాళెం వద్ద బోరు పాయింట్ వేయిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నాగజ్యోతి, సర్పంచ్ నాగరాజులు

కారు బోల్తా.. ముగ్గురికి గాయాలు


రోడ్డుపై బోల్తాపడిన కారు

పెళ్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : కారు బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని పెన్నేపల్లి 71వ జాతీయ రహదరిపై సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు ..నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్ ఎస్‌బీఐలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ భార్య తమిళనాడులోని రాయవేలూరులోని కెనరా బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో తన తల్లిదండ్రులు పోలమ్మ, రమణయ్యలతో కలసి చంద్రశేఖర్ కారులో రాయవేలూరుకు వెళ్లారు. అనతరం రాయవేలూరు నుంచి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలోని పెన్నేపల్లి వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలమ్మ, రమణయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు


అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి

పెళ్లకూరు,లోమే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్ కుమార్, హౌసింగ్ ఏఈ వెంకయ్య, ఐకేపీ ఏపీఎం హేమామాలిని, పీఆర్ ఏఈ వెంకటేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి ఉన్నారు.

మహానాడుకు తరలిరండి

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : కడపలో ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడుకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు ఓజిలి మండల టీడీపీ యంత్రాంగం సమాయత్తమైంది. ఈమేరకు మండల కన్వీనరు విజయకుమార్ నాయుడు సోమవారం మండలంలోని అందరు క్లస్టర్ ఇన్‌చార్జిలు, అనుబంధ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు పార్టీ అభిమానులు, క్రియాశీల సభ్యులతో చర్చించారు.

పీజీఆర్‌ఎస్‌కు మూడు వినతులు

ఓజిలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఓజిలి తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు అందాయని తహసీల్దారు పద్మావతి అన్నారు. కాగా మండలంలోని అత్తివరం, గ్రద్దగుంట గ్రామాలలో రీసర్వే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఇప్పటికే ఫీల్డు వెరిఫికేషన్ పూర్తికావస్తుందని తహసీల్దారు తెలిపారు.

సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం సాయంత్రం తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి కారుమబ్బులు కమ్ముకుని వాతావరణం చల్లగా ఉనింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై తేలికపాటి గాలులతో కూడిన వర్షం అరగంటపాటు కురిసింది. గాలులు వీయడంతో పట్టణంలో పలుచోట్ల దాదాపు గంటపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

చిల్లకూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మళ్లదిబ్బ గ్రామానికి చెందిన అజారుద్దీన్(18)అనే యువకుడు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెంఆడు. అజారుద్దీన్ ఆదివారం స్నేహితులతో కలిసి తాటి కాయలకు వెళ్లి వస్తుండగా పిడుగుపాటుకు అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రి తరలించగా సోమవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపట్నంలో ఆధార్ సేవలు ప్రారంభం

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపట్నం సచివాల యంలో గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులకు ఆధార్ కేంద్రం ప్రారంభమైంది. కొత్తపట్నం, యమదినెన్న పాళెం, గున్నంపడియ, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, గోవిందపల్లిపాళెం గ్రామాల్లో ఉన్న గిరిజనులు ఈ ఆధార్ కేంద్రానికి వచ్చి ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకున్నారు. ఆయా సేవలను ఎంపీడీఓ దిలీప్ కుమార్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి అల్లాభక్షుల పర్యవేక్షణలో జరిగాయి.

రేషన్‌కార్డులు.. సర్వర్ కష్టాలు

తడ, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొత్త రేషన్‌కార్డు నమోదులో ఆధార్ అప్‌డేట్‌కు కష్టాలు తప్పడం లేదు. సర్వర్ ఎప్పుడు పనిచేస్తుందో...ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితుల్లో జనం సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో కొంతసేపు పనిచేసిన ఆ తరువాత అది పనిచేయకపోవడంతో జనాలకు చుక్కలు కనబడుతున్నాయి. సోమవారం పలు సచివాలయాల వద్ద జనం ఇలాగే నమోదు కోసం ఎదురుచూశారు. ఆధార్ అప్‌డేట్, చంటిబిడ్డ ఆధార్‌కోసం వచ్చిన జనం గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది.


ఆన్‌లైన్ అంతరాయంతో తడ సచివాలయం వద్ద కూర్చొని ఉన్న గ్రామస్తులు, చంటిబిడ్డతో వచ్చి ఎదురుచూస్తున్న మహిళ

నేటి నుంచి ఐదురోజులు యోగా శిక్షణ

కోట, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 16 సచివాలయాలను నాలుగు క్లస్టర్లుగా విభజించి ఐదు రోజుల పాటు యోగాపై సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం యోగా కార్యక్రమాలపై సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నేర్చుకోవాలన్న యువకులకు, సచివాలయ సిబ్బందికి కోట 1వ సచివాలయం, చిట్టేడు ఉన్నత పాఠశాల, చెందోడు ప్రాథమిక పాఠశాల, సిద్ధవరం సచివాలయాల్లో మంగళ వారం నుంచి ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తామని వివరిం చారు. తర్వాత జూన్ 1వ తేదీ నుంచి ఆయా సచివాలయాల పరిధిలో గల ప్రజలకు శిక్షణ పొందిన సిబ్బంది అవగాహన కల్పిస్తారన్నారు. తహసీల్దార్, ఎంఈఓ, ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓల పర్యవేక్షలో ఈ యోగా కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీఓ దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు.

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

● మృతదేహాలను బంధువులకు అప్పగించాలి
● సీపీఐ నేత హరినాథరెడ్డి డిమాండ్

తిరుపతి(ఆటోనగర్), మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఇటీవల జరిపిన మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, వారి మృతదేహాలను వెంటనే బంధువులకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించి అటవీ ప్రాంతాల్లో ఉన్న గిరిజన ఆదివాసీయులను, మావోయిస్టులను హతమారుస్తోంద న్నారు. ప్రధాన మంత్రి, హోంమంత్రి ఈ హత్యలను సమర్థించడం ఆటవిక చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ హత్యాకాండను తమ పార్టీ ఖండిస్తోందన్నారు. అటవీ ప్రాంతాల నుంచి ఆదివాసీయులను కనుమరుగు చేసి అక్కడ ఉన్న ఖనిజ సంపదను కార్పొరేటర్లకు అప్పగించడానికి కగార్ ఆపరేషన్ చేపట్టిందని ఆరోపించారు. మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించి మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే స్పందించకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సీపీఐ నాయకులు సి.పెంచలయ్య, కె.రాధాకృష్ణ, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



పట్టణంలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారాన్ని పురస్కరించుకుని ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయుడికి పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంతో అభిషేకించారు. వివిధ పుష్పాలతో, గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి మహా మంగళహారతి సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

సాగు భూములకు పట్టాలివ్వండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితుల ధర్నా

బుచ్చినాయుడుకండ్రిగ, మే 26 (ఆంధ్రజ్యోతి): తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని మండలంలోని కుక్కంబాకం దళితులు సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం ఏరియా కార్యదర్శి దాసరి జనార్ధన్ మాట్లాడుతూ... కుక్కంబాకం రెవెన్యూ సర్వే నెం.81లో 80 ఎకరాలను స్థానికేతరులు బినామీ పట్టాలు సృష్టించి దళితులపై కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. పది సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పలుమార్లు ధర్నా చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రమణయ్య, గంధం మణి, తిరుపాలు, కృష్ణమ్మ, శంకరమ్మ, వెంకి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరానికి స్పందన



బుచ్చినాయుడుకండ్రిగ, మే 26 (ఆంధ్ర జ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో చిన్నారుల కోసం సోమవారం నిర్వహించిన ఆధార్ ప్రత్యేక శిబిరానికి స్పందన లభించింది. అనేక గ్రామాల్లో చిన్నారులకు ఆధార్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఆదేశాలతో మండలంలోని అంగనవాడీ పరిధిలో ఉన్న చిన్నారులను గుర్తించి ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డులు చేయించారు. దీంతో కార్యాలయం కిటకిటలాడింది.

బాధితులకు సీఎం సహాయనిధి పంపిణీ



బాధితులకు చెక్కులు అందిస్తున్న టీడీపీ నాయకులు

వరదయ్యపాళెం, మే 26(ఆంధ్ర జ్యోతి): మండలంలో ఇటీవ ప్రమాదం, అనారోగ్యానికి గురైన బాధితులకు వైద్యఖర్చులకు సీఎం సహాయ నిధి ద్వారా కూటమి ప్రభుత్వం చేయూత నిచ్చిందని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ అన్నారు. మండలంలో పలువురు బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధిని సోమవారం ఆయన అందజేశారు. కంచరపాళెంకు చెందిన విక్రమ్‌కు రూ.45వేలు, మావిళ్లపాడుకు చెందిన దీనదయాల్‌కు 1.18లక్షలు, చిన్నపాండూరుకు చెందిన చల్లమ్మకు రూ.44,333, బీఎన్‌కండ్రిగమండలం పార్లపల్లికు చెందిన గురునాథంకు రూ.30వేలు అందజేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మహానాడుకు తరలిరండి



- టీడీపీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే భాను పిలుపు

పుత్తూరు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప కేంద్రంగా కనీవినీ ఎరుగని రీతిలో మహానాడు-2025ను అంగరంగ వైభవంగా జరుపుకోబోతోందని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు 27, 28, 29 తేదీలలో జరిగే మహానాడు పండుగకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల పార్టీకి పేరుగాంచిన తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమై నిలవాలన్నారు. ఈ మహానాడును చారిత్రాత్మకంగా నిలిచిపోయేలా అందరం సమిష్టిగా తరలిరావాలని కోరారు.

యోగాతో జీవ నైపుణ్యం, ఆధ్యాత్మిక వికాసం

పుత్తూరు, మే 26(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక శక్తుల ఐక్యతో చేసే యోగా వల్ల జీవన నైపుణ్యాలు, ఆధ్యాత్మిక వికాసం అలవడుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కోసం సోమవారం కళాశాలలో యోగా అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో నరసింహులు, రఘురామన్, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

నేటినుంచి యోగాంధ్ర శిక్షణ శిబిరాలు

వడమాలపేట, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పంచాయతీ కేంద్రాల్లో నేటినుంచి యోగాంధ్ర శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు చెప్పారు. మండలంలో ఐదు రోజులపాటు వడమాలపేట, కాయం, ఎస్బీఆర్ పురం, అప్పలాయగుంటలలో శిక్షకుల ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగాసనాల నేర్పుతారని చెప్పారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని ఆసనాల ద్వారా కాపాడుకోవాలని కోరారు.

యోగా పోటీలు

పుత్తూరు అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): జీవన విధానంలో సంపూర్ణ మార్పునకు యోగా దోహదం చేస్తుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. యోగాంధ్రలో భాగంగా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో సోమవారం పోటీలు నిర్వహించారు. ముందస్తుగా ఆన్‌లైన్ నమోదు చేసుకున్న చిన్నారులు, యువత పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారికి మండల స్థాయి, ఆ తరువాత జిల్లా స్థాయి పోటీల్లో ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. అంతే కాకుండా సచివాలయాల పరిధిలో 10 మంది చొప్పున యువతను ఎంపిక చేశారు. వీరికి ఐదు రోజుల పాటు యోగా శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఆ తరువాత వీరందరూ ఆయా సచివాలయాల పరిధిలో 50 మంది చొప్పున యోగాలో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలా 7 వేల మంది యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రేపు ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను ఆలయ ఆవరణలోని కొట్టు మండపం వద్ద ఉదయం 7గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆగని స్టార్టర్ల చోరీ

- లబోదిబోమంటున్న రైతులు
- రాత్రి గస్తీ పెంచాలంటున్న అన్నదాతలు



దుండగులు పగులగొట్టిన స్టార్టర్ల బాక్సును చూపుతున్న రైతు మహేష్

ఏర్పేడు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎండీపుత్తూరు పరిధిలోని పొలాల్లో సుమా రు 50మంది రైతులకు చెందిన వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్లను, స్టార్టర్లను ఆదివారం రాత్రి చోరీకి చేశారు. సోమవారం ఉదయం 4 గంటలకు మోటర్లను వేసేందుకు రైతులు పొలాల వద్దకు వెళ్లగా చోరీకి గురైనట్లు గుర్తించి లబోదిబోమన్నారు. వరిమడులు నాటేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్న సమయంలో ఇలా కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీకి గురికావడంతో దిక్కు తోచని స్థితికి చేరుకుంటున్నారు. కొత్తవి వేసుకోవాలంటే కనీసం వారం రోజులు పడుతుందని, సుమారు రూ.20వేలు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. పోలీసులు గస్తీ పెంచి చోరీలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

నేటినుంచి యోగాంధ్ర

వరదయ్యపాళెం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని యోగా శిక్షణ కేంద్రంలో మంగళవారం నుంచి యోగాంధ్ర ప్రారంభమవుతుందని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. మండలంలోని 13 సచివాలయాలు, నాలుగు క్లస్టర్లకు సంబంధించి ఎంవోటీగా తహసీల్దారు సుధీర్‌రెడ్డి ఉంటారన్నారు. ఆయన పరిధిలో సీఎల్ఎన్‌పల్లి, మరదవాడ, సంత వేలూరు సచివాలయాలు ఉంటాయన్నారు. ఎంఈవో సరస్వతి ఆధ్వర్యంలో బత్తలవల్లం, మత్తేరిమిట్ట, కారిపాకం, ఎంపీడీవో ప్రసాద్ ఆధ్వర్యంలో వరదయ్యపాళెం 1, 2, కాంబాకం, ఇందిరానగర్ సచివాలయం, డిప్యూటీ ఎంపీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో పాండూరు, చిన్న పాండూరు, కదూరు సచివాలయాలు ఉంటాయన్నారు. జూన్ 31 వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. ప్రతి సచివాలయ పరిధిలో యోగా శిక్షణ ఇసామన్నారు. ఆసక్తి గలిగిన వారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): మండలంలో యోగాంధ్ర శిబిరం, పోటీలు ప్రారంభం కాలేదు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావుని వివరణ కోరగా.. సమన్వయం లోపం వల్ల శిక్షణ ప్రారంభం కాలేదన్నారు. ఈ నెల 27న మంగళవారం మండలంలోని కరకంబాడి, గుత్తివారిపల్లి జడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో, గాజులమండ్యంలోని శివాలయంలో తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు.

భక్తులకు అన్నదానం

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువై ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, జయగణేష్, హరిహర కుమార్, రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



నారాయణవనం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలమంగళం ఉత్తరంలో కొలువై ఉన్న రౌద్రాళి అంకాలమ్మ జాతరలో భాగంగా సోమవారం సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం రౌద్రాళి అంకాలమ్మను సర్వభూపాల వాహనంపై అధిష్ఠింపజేసి ఊరేగించారు. భక్తులు పసుపు వస్త్రాలను ధరించి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు అమావాస్య ఘడియలు కలిసి రావడంతో రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 548 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,139, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,220మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,497మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,331, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 246, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 76మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,991 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మహానాడు ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్ల పరిశీలన అనంతరం ఎమ్మెల్యే సుధీర్ తదితరులు

శ్రీకాళహస్తి, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27న మంగళవారం నుంచి జరిగే మహానాడు ఏర్పాట్లను సోమవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ సహచర ఎమ్మెల్యేలు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహానాడు ఏర్పాట్లు అద్భుతంగా జరుగుతున్నాయన్నారు. నాయకులు, కార్యకర్తలకు తగిన ఏర్పాట్లు చేశారని తెలిపారు. మహా నాడు మూడు రోజుల పాటు పండుగ వాతావరణంలో జరుగుతుందని తెలిపారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా చైర్మన్ దివాకర రెడ్డి, చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం మహానాడును విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, దశరథాచారి పిలుపునిచ్చారు. సోమవారం వారు మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ చేతుల మీదుగా మహానాడు ప్రారంభమైందన్నారు. కడపలో మూడు రోజుల పాటు ఈ మహానాడు జరుగుతుందన్నారు. మహానాడు నిర్వహిస్తున్న సమయంలో వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడం హర్షణీయమని తెలిపారు. గత వైసీపీ పాలనలో అతలాకుతలమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టడానికి తీసుకోవాల్సిన చర్యలు మహానాడు వేదికపై తీర్మానిస్తారన్నారు. ఈ మహానాడు కార్యక్రమానికి తరలి వస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు తగిన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, తొట్టంబేడు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు గాలి మురళినాయుడు, టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు, నాయకులు బాలాజీరెడ్డి, ముని రాజా యాదవ్, ఎంఎస్‌రెడ్డి, వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్, భీమాల భాస్కర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనార్టీ సంక్షేమ పథకాలు అన్ని నిర్వీర్యమైపోయాయని పేర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మైనార్టీల అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ఇక నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మైనార్టీల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ పేదలకు సబ్సిడీ రుణాలను విడుదల చేసిందన్నారు. మైనార్టీలకు చెందిన వ్యాపారులు, పేదలు సమీపంలోని మీసేవ కేంద్రం, సచివాలయాల వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల ధృవీకరణ పత్రంతో అవసరం లేకుండా రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

తిరంగా ర్యాలీ



రేణిగుంట, మే 26 (ఆంధ్రజ్యోతి): దేశ సైన్యానికి మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. సోమవారం సాయంత్రం ఆర్టీసీ బస్టాండ్ వద్ద వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోవతి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా పాల్గొని జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి సీనప్ప, టీడీపీ నాయకులు ఉదయ్‌కుమార్ రెడ్డి, రవి, సూరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రావణ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విధుల్లోకి ఎంఎల్‌హెచ్‌పీలు

కేవీబీపురం, మే 26(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో చేరారు. గత 27 రోజులుగా మండలంలో పని చేస్తున్న సుమారు 17మంది మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు తమ డిమాండ్ల కోసం నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఉన్నతాధికారులతో చర్యలు సఫలం కావడంతో యూనియన్ ఆదేశాల మేరకు సోమవారం వారు విధుల్లో చేరారు. ఇందుకు సంబంధించి అనుమతిపత్రాన్ని వైద్యాధికారి రామ్‌నాయక్‌కు అందజేశారు.

'కేశవరావుని' చూసి భయపడుతున్న కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు

శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు భౌతికకాయాన్ని చూసి ప్రభుత్వాలు భయపడుతున్నాయని సీపీఐ ఏరియా కార్యదర్శి జె.గురవయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. కేశవరావు సహా ఆ పార్టీ నాయకులు, ఆదివాసీలను మోదీ ప్రభుత్వం హత్య చేసిందన్నారు. వెంటనే ఆ మృతదేహాలను బంధువులకు అప్పగించాలన్నారు. నారాయణపురం మారణకాండ సహా అడవుల్లో సాగిస్తున్న మరణహోమంపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. వెంటనే కగార్ ఆపరేషన్‌ను నిలిపి వేయాలన్నారు. హైకోర్టు అనుమతి ఇచ్చినా మృతదేహాలను ఇంకా బంధువులకు అప్పగించకపోవడం కోర్టు ధిక్కరణ కింద పోలీసులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబుకు ప్రజల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల ఏమాత్రం విశ్వాసం ఉన్నా తక్షణమే మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ధర్మరాజులు స్వామి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఏర్పేడు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతవీరాపురంలో ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామిఅమ్మవార్లను దర్శించుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌కు ఉత్సవ నిర్వాహకులు ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంగర రవిరెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులున్నారు.

కుమారస్వామికి ప్రత్యేక పూజలు



ఏర్పేడు, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపానాయుడుపేటలో కొలువై ఉన్న వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామికి కృత్తిక పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఇక సాయంత్రం స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

తుడా చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాలర్స్ దివాకర్‌రెడ్డిని సోమవారం ఆయన స్వగృహంలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను దుశ్శాలువాతో సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.